క్లుప్తంగా

టేస్టీ సేమియా.. ఈద్ ప్రత్యేకం



పొన్నూరు: రంజాన్ ప్రత్యేకం అనగానే గుర్తు కొచ్చేది సేమియా. పండుగరోజు వంటకాలలో ముస్లింలు ప్రత్యేకంగా ఖీర్ (పాయసం), షీర్ కుర్మా తదితర రుచికరమైన స్వీట్లు తయారు చేస్తారు. గోధుమలతో సన్నని దారం పోగులను తలపించే సేమియాను తయారు చేసి విక్రయించడంలో పట్టణంలోని చాందినీ చౌక్ సెంటర్ పేరుగాంచింది. ముఫ్తీ ముజమ్మిల్ ఆజాదీ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో నిత్యం వందల కిలోల సేమియా తయారు చేస్తుంటారు. పలువురు ముస్లింలు ఇళ్ల వద్దే సొంతంగా తయారు చేసి విక్రయిస్తుంటారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడిఅసిస్ట్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సంస్థ వారితో ఏడాదికి రూ 2.6 లక్షల వేతనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

వాహనాల విస్తృత తనిఖీ



మంగళగిరి: మంగళగిరి రూరల్ పరిధిలో పలుచోట్ల రూరల్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, తాయిలాలు రవాణా కాకుండా వాహనాలను తనిఖీ నిర్వహించినట్లు సీఐ వెంకటరావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి నగదు, ఏవైనా వస్తువులు రవాణా చేస్తే కేసు నమోదు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో పలుచోట్ల కార్లు, ద్విచక్ర వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో ఎస్ఐ క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 7వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి సాహితి కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తి ప్రదాతలు పుస్తకావిష్కరణ చేయనున్నట్లు కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా శనివారం కళావేదిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తి నింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన స్ఫూర్తిప్రదాతలు పుస్తకం ఆవిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయ రావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయ మోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట కల నిర్మల ఫార్మసీ కళాశాలలో పలువురు విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.పాములరెడ్డి తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 200 మంది విద్యార్థులు హాజరుకాగా, 86 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించగా, వారికి రూ 2.50లక్షల వార్షిక వేతనం అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శంఖుల కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబులు అభినందించినట్లు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషిచేద్దాం

స్వర్ణభారతినగర్‌లో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరం సమష్టిగా కృషి చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణభారతి నగర్‌లో గడప గడపకు జగనన్న గుండె గుండెకు కిరణన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతి గడపకు తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు జరిగిన మేలు, సంక్షేమ పథకాలు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను, ప్రత్తిపాడు నియోజకవర్గంలో తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. తల్లి కడుపులోని బిడ్డనుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. చంద్రబాబు అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని గుర్తు చేశారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటే ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన గోరంట్ల నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడంతే అన్న చందంగా జగనన్న సుపరిపాలన సాగిందని అటువంటి మంచి నాయకుడి నాయకత్వంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని వికాస్‌నగర్‌లో గల క్యాంపు కార్యాలయంలో గోరంట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందుల నరసింహారావు, కుటుంబ సభ్యులు, కందుల రాజు, కందుల గంగాభవాని, అరిగెల వెంకటరావు (మాజీ ఎంపీటీసీ), దూపం వరప్రసాద్, జల్లేపల్లి శ్రీనివాస్ (వాసు), గడ్డం ప్రసాద్‌లతో పాటు 100 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఎంపీడీఓకు రాజీనామ పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

కాకుమాను: ఇంటి వద్దకే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్‌ల వ్యవస్థను తీసుకు వచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తుంటే ప్రజలకు సేవ చేయకుండా టీడీపీ, జనసేనలు అడ్డుకోవడం అన్యాయని వలంటీర్‌లు అన్నారు. పెదనందిపాడు మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన 17 మంది వలంటీర్‌లు శనివారం ఎంపీడీఓ సునీత శర్మకు తమ రాజీనామ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి పింఛన్ నగదు కోసం అవ్వా తాతలు పడుతున్న అవస్థలు చూసి రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.త్వరలో జరగనున్న ఎన్నికల్లో గర్వంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలిపారు.

'పది' మూల్యాంకన కేంద్రం పరిశీలన

పెదకాకాని: పెదకాకాని రోడ్డులోని సెయింట్ జోసెఫ్ సీబీఎస్ఈ స్కూలు నందు నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో పరీక్షా పత్రాల మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి, ఉపాధ్యాయులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు ఏ విధమైన పొరపాట్లకు అవకాశం లేకుండా మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో కల్పించిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకట్‌రెడ్డి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖాధికారి బలిరాం, సీనియర్ ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం, పాల్గొన్నారు.

'గడప గడపకు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో రవీంద్రనాథ్ తదితరులు

నగరంపాలెం: సాహితీ ఉద్యమకారుడు వల్లూరు శివప్రసాద్ నాలుగు దశాబ్దాలుగా ఎన్నో చక్కని కథలు, నాటికలు రాశారని కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత అదనపు కమిషనర్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన కథలు హాస్యంతో పాటు ఆలోచింపజేసేలా ఉంటాయని చెప్పారు. వల్లూరు శివప్రసాద్ రచించిన 'గడప గడపకు' హాస్య, వ్యంగ్య కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభ శనివారం రాత్రి బృందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉత్తమ నాటక రచయితగా వల్లూరు శివప్రసాద్ ఆరుసార్లు రాష్ట్ర ప్రభుత్వ నంది బహుమతులు పొందారని తెలిపారు. కథా సంపుటిని ప్రముఖ సాహితీ విమర్శకురాలు సీహెచ్.సుశీల సమీక్షించారు. సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్రజ్యోతిశ్రీ అధ్యక్షత వహించగా, కొటక్ మహీంద్ర బ్యాంక్ విశ్రాంత అసోసియేట్ ఉపాధ్యక్షుడు పి.వీరారెడ్డి తొలి ప్రతిని అందుకున్నారు. అనంతరం రచయిత వల్లూరు శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు వల్లూరు తాండవకృష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం నాయకులు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రోధి నామ సాహితీ వసంతోత్సవానికి సన్నద్ధం

- 27వ వసంతంలోకి సాహితీ సమాఖ్య
- ఉగాది నాడు విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ వసంతోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న సంస్థ సభ్యులు
- ఒకే వేదికపై 26 ఏళ్లుగా వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం
- ఇప్పటి వరకు 270 మందికి పైగా పురస్కారాలు
- సాహిత్యాభిమానుల ప్రశంసలు



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాత గుంటూరు: సాహిత్యంతో సమాజంలో ఎంతటి మార్పునైనా తీసుకురాగలమనే లక్ష్యంతో నగరంలో సాహితీ సమాఖ్య సంస్థ స్థాపించబడింది. 1997లో సాహిత్యాభిమాని ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ వ్యవస్థాపక కార్యదర్శిగా మిత్ర బృందంతో కలిసి నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉగాది రోజున 'సాహితీ వసంతోత్సవం' పేరుతో విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 270 మందికి పైగా సుప్రసిద్ధ కవులు, కవయిత్రులు, కార్టూనిస్టులు, గురుస్వాములు, యువ కవులకు పురస్కారాలు అందించారు. సినీ ప్రముఖులు కె.విశ్వనాథ్, గుమ్మడి వెంకటేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, సింగీతం శ్రీనివాసరావు, చంద్రబోస్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, అనంత శ్రీరామ్, వేటూరి సుందరరామ్మూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, పాపినేని శివశంకర్, వాడ్రేవు చినవీరభద్రుడు, కొలకలూరి ఇనాక్, గోరటి వెంకన్న, అందెశ్రీ , వరంగల్ శ్రీనివాస్... ఇలా ఎంతోమందికి ఈ పురస్కారాలు వరించాయి.

సభా ప్రాంగణం ముస్తాబు

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ సమాఖ్య ఉగాది పండుగ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి సాహితీ వసంతోత్సవ సభను నిర్వహిస్తుంది. పండుగకు ప్రతీకగా ప్రాంగణాన్ని, వేదికను తీర్చిదిద్దుతారు. మామిడి తోరణాలు, అరటి బోదెలు, కొబ్బరి ఆకులు, రకరకాల పూలతో వేదికను అలంకరిస్తారు. సభకు వచ్చే అతిథులంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ పఠనం తర్వాత సాహితీ సమ్మేళనం, అతిథుల ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రదానాలు, కవితా ప్రదర్శనలు రాత్రి పది గంటల వరకూ కొనసాగుతాయి.

అందరూ ఆహ్వానితులే..

సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని 27 వసంతాల సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణతో సభలో పాల్గొనాలని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ, నాదస్వర కచేరి, వేద పఠనం, పంచాంగ శ్రవణం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సభకు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సినీ రచయిత చంద్రబోస్‌కు క్రోధి నామ ఆత్మీయ సత్కారం, సుప్రసిద్ధ పండితులు అవధాని డాక్టర్. ధూళిపాళ మహాదేవమణికి క్రోధినామ సాహితీ పురస్కారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జరిగే సాహితీ సమ్మేళనంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కార్యదర్శి ఆర్. రాము, రవి శ్రీనివాస్, టీయంటీ ట్రస్ట్ కార్యదర్శి పి. రామచంద్రరాజు పాల్గొని ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు.

గెలిపించండి.. అండగా ఉంటా

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



ప్రచారం నిర్వహిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎల్లప్పుడూ అండగా ఉండి పొన్నూరు అభివృద్ధిని పరుగులు తీయిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని 18, 19 వార్డులలో అంబటి మురళీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రచార పత్రాలను ప్రజలకు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. సీఎం జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని మరువకుండా రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మరో పర్యాయం వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, పార్టీ నాయకులు షేక్ నాజర్, బొనిగల వేణుప్రసాద్, రుద్రపాటి ఆదిశేషులు, వడ్రాణం ప్రసాదు, బొద్దులూరి రంగారావు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, మండ్రు అనిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: కంటైనర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు బైపాస్ హైవేలో నగరానికి చెందిని చేరెడ్డి మోహనరావు(52) పూల వ్యాపారం చేస్తుంటాడు. ఆటోలో పూలబస్తాలను హైవే పక్కనే దించి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో చిలకలూరుపేట వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి మోహనరావును ఢీకొంది. సంఘటనలో తీవ్రగాయాలతో మోహనరావు అక్కడిక్కడే మృతి చెందారు. సంఘటన విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సంఘటపై మృతుని కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ఇఫ్తార్ విందులో అంబటి మురళీకృష్ణ



ఇఫ్తార్ విందులో పాల్గొని భోజనం వడ్డిస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ముస్లింలు బంధుమిత్రలను ఒకచోటకు ఆహ్వానించి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసుకోవడం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పొన్నూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని, నంబూరు గ్రామాల్లో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు అంబటి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ఎంతో నిష్ఠతో ముస్లింలు ఉపవాలు ఉండి, ప్రార్థనల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. తొలుత ముస్లిం మైనార్టీ సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచి గోళ్ల స్వరూపరాణి, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, బంగారు మరియమ్మ, మాతంగి నిర్మల, షేక్ అబ్దుల్ లతీఫ్, వల్లబాపురపు విజయ్‌కుమార్, దాసరి నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, షేక్ నజీర్ అహ్మద్, స్థానిక నాయకులు ఉయ్యూరు సతీష్‌రెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి, షేక్ దండిబాబు, సయ్యద్ సుభాని, షేక్ మీరు షేక్ ఫైజుద్దీన్, షేక్ షబ్బీర్, షేక్ అలీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో గెలిపించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సర్పంచులతో సమావేశం నిర్వహించారు.

మొక్కజొన్న పంట పరిశీలన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి ప్రాంతాల్లో మొక్కజొన్న రైతులు ప్రైవేటు కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి మోసపోయిన విషయమై మార్చి 23న 'నట్టేట మునిగిన మొక్కజొన్న రైతు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి గ్రామాల్లో నష్టపోయిన రైతులను పరామర్శించారు. లాంఫాంకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ వైసతీష్ కుమార్, డాక్టర్ పుష్పరేణి మైకో ఎంఆర్ఎం 4065 మొక్కజొన్న విత్తనాలు వాడిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వై.సతీష్ మాట్లాడుతూ నష్టపోయిన మొక్కజొన్న రైతుల పొలాల నుంచి మొక్కజొన్న పొత్తులను సేకరించి దిగుబడిని కూడా పరిశీలిస్తున్నామని, తదుపరి విచారణ అనంతరం కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రామచంద్రరావు, తెనాలి సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.ఉషారాణి, వ్యవసాయ అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

ఏపీ రైతు సాధికారసంస్థ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి



నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేసిన రైతులతో రైతు సాధికార సంస్థ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించటంతోపాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఏపీ రైతు సాధికారసంస్థ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నవధాన్యాలు పండిస్తున్న రైతులు, సేంద్రియ వ్యవసాయ చేస్తున్న రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆశయంతో రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ ద్వారా ఒక వినూత్న పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ఈ లాభసాటి వ్యవసాయం భూసార పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగల శక్తి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని చెప్పారు. విష రసాయన రహిత ఆహార ఉత్పత్తులను సమాజానికి అందించవచ్చన్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానం అవలంభిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారయ్యే ఉత్పత్తులు, ఇతర వస్తువులు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి రైతులచేత నడిపించే షాప్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రపంచ దేశాలు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు ఆకర్షితమవుతున్నాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధి ఝాన్సీ లక్ష్మి, గ్రామంలోని రైతులు తదితరులున్నారు.

వ్యక్తిపై దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

గుంటూరు రూరల్: ఇరువర్గాల మధ్య వివాదం నేపథ్యంలో ప్రత్యర్థిపై మద్యం సీసాలతో దాడిచేసిన వ్యక్తులను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి అమరావతిరోడ్డులోని ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న మణికంఠస్వామి అనే వ్యక్తిని చిల్లర కిషోర్, విజయకిషోర్, పి.రమేష్, వెంకటేష్ అనే నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన సంఘటనలో బాధితుడు మణికంఠస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

'మేమంతా సిద్ధం' విజయవంతం చేద్దాం

పెదనందిపాడులో మేమంతా సిద్ధం పోస్టర్‌ల పంపిణీ



కాకుమాను: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సు యాత్ర విజయవంతం చేయడానికి పెదనందిపాడు మండలం మొత్తం సిద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖాసీంపీరా అన్నారు. పెదనందిపాడులోని 5,6వ వార్డులలో శనివారం రాత్రి సిద్ధం పోస్టర్‌లను గడప గడపకు వెళ్లి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ సోమవారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు మండలంలోని పార్టీ శ్రేణులందరు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్రప్రజల మన్ననలతో పాటు దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసే విధంగా జగనన్న పాలన చేసినట్లు ఆయన తెలిపారు. మాట ఇస్తే మడమ తిప్పకుండా ఎన్ని ఇబ్బందులు ఎదురైన సకాలంలో పథకాలను ప్రజల వద్దకే అందించిన ఘనత జగనన్నదేనని ఆయన తెలిపారు. కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి సిద్ధం పోస్టర్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు కమ్మా సాంబశివరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు దివి నాగయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ మేడిద రవి కుమార్, గేరా గణేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని తాడేపల్లి మండల విద్యాశాఖాధికారులు గరిక శాంత కుమారి, డి.నాగేశ్వరరావులు అభినందించారు. పాఠశాలలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అబ్దుల్ షబీర్ మాట్లాడుతూ సైన్స్‌డే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలు – 2024లో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ సమీవూన్ ద్వితీయ బహుమతి సాధించిందని ఆ బహుమతిని మండల విద్యాశాఖాధికారులు గరిక శాంతకుమారి, డి. నాగేశ్వరరావులు విద్యార్థినికి అందజేశారని తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు గరిక శాంతకుమారి, డి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షాహిద్ అలీ పేరును సిఫార్సు చేస్తామని అన్నారు.